



• విద్యుత్ ప్రగతిభవన్



» వివాదాల్లో విద్యుత్ శాఖ అధికారులు
» రెండు నెలల్లో ఏడుగురు సస్పెన్షన్, ఇద్దరు బదిలీలు
» విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొందరి సస్పెండ్
» అతిగా ప్రవర్తించి సస్పెండ్ అయిన మరికొందరు ఉద్యోగులు
» ప్రభావం చూపని యూనియన్లు

విద్యుత్ శాఖలో.. సస్పెన్షన్ గుబులు!

సుభాష్‌నగర్, ఏప్రిల్ 6: విద్యుత్‌శాఖలో సస్పెన్షన్ల పరంపర సాగుతోంది. గత కొద్దికాలంగా విద్యుత్‌శాఖ అధికారులు వివాదాస్పదంగా మారుతున్నారు. కొందరు ఉద్యోగులు కాసుల కోసం పక్కచూపులు చూస్తుండగా.. మరికొందరు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ విద్యుత్ శాఖకు మచ్చ తెస్తున్నారు. కొన్నినెలల క్రితం కాసుల కక్కుర్తి కోసం కామారెడ్డి జిల్లాలో ఏసీబీకీ పట్టుబడగా.. నిజామాబాద్ జిల్లాలో విధుల్లో నిర్లక్ష్యం చేసినందుకు సస్పెన్షన్‌కు గురయ్యారు. మరికొందరు విధుల్లో అత్యుత్సాహం ప్రదర్శించి సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో విద్యుత్ శాఖలో అధికారులు రెండు నెలలుగా వివాదాల్లో ఉన్నారు. గత రెండు నెలలుగా మొత్తం ఏడుగురు విద్యుత్‌శాఖ అధికారులు సస్పెండ్‌కు గురయ్యారు. ఇందులో ఏడీఈ ఒకరు, ఏఈవో ఒకరు, జేఏవో ఒకరు, లైన్‌మెన్‌లు ముగ్గురు, ఆర్టీజన్ కార్మికులు ఉన్నారు. వీరితోపాటు ఇద్దరు ఏఈలు బదిలీ అయ్యారు. గతంలో విధుల్లో నిర్లక్ష్యం వహించినా చూసీ చూడనట్లు వ్యవహరించిన ఉన్నతాధికారులు ప్రస్తుతం ఏ చిన్న తప్పు జరిగిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. నూతనంగా ఐఏఎస్ అధికారి సీఎండీగా రావడంతో అధికారులపై చర్యలు వెంటవెంటనే జరిగిపోతున్నాయి.

రెండు నెలల్లో ఏడుగురి సస్పెన్షన్

రెండునెలల్లోనే విద్యుత్‌శాఖలో ఏడుగురు ఉగ్యోగులను సస్పెండ్ చేస్తూ విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. మరో ఇద్దరిని క్రమశిక్షణా చర్యల కింద బదిలీవేటు వేశారు. ఇందులో ఎడపల్లి ఈడీఈగా పని చేస్తున్న లక్ష్మణ్‌నాయక్, ఎడపల్లి ఏఈగా పనిచేస్తున్న ప్రసాద్ కొన్నిరోజుల క్రితం కార్యాలయంలోనే ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా దీన్ని సీరియస్‌గా భావించిన ఉన్నతాధికారులు ఏడీఈని సస్పెండ్ చేస్తూ ఏఈని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఉద్యోగాలు ఇస్తామని డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలపై నిజామాబాద్ డీఈ ఏఈ రాంసింగ్‌పై సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా వేల్పూర్ ఏఈ యశ్వంత్‌రావు ఓ పార్టీకి సంబంధించి ప్రచారం చేస్తున్నారని, సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయడంతో ఏఈని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా జేఏవో శ్రీహరిపై ఉన్నతాధికారి ఫిర్యాదు చేయడంతో జేఏవోను సస్పెండ్ చేశారు. దీంతో పాటు ముగ్గురు లైన్‌మెన్‌లు, ఒక ఆర్టీజన్ కార్మికుడిని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. వీటితోపాటు విద్యుత్‌శాఖ కొందరు అధికారులపై ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. తాజాగా భీంగల్ డివిజన్ పల్లికొండ గ్రామాల్లో ఎస్టిమేషన్ లేకుండా విద్యుత్ స్తంభాన్ని వేశారని నేరుగా ఎస్ఈకి ఫిర్యాదు చేశారు. ధర్మారం లైన్ మెన్‌పై ఆరోపణలు ఉన్నాయి.

ప్రభావం చూపని యూనియన్లు

గతంలో ఉన్నతాధికారి ఉద్యోగిపై చర్యలు తీసుకోకముందే యూనియన్ నాయకులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించి ఉద్యోగిపై చర్యలు తీసుకోకుండా చర్యలు చేపట్టేవారు. ఎలాగైనా ఉద్యోగిపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చితమ పంథాన్ని నెగ్గించుకునేవారు. అయితే ప్రస్తుతం యూనియన్లు ఏ విషయంలోనూ పెద్దగా జోక్యం చేసుకోవడం లేదని, చేసినా ప్రభావం చూపడం లేదని తెలుస్తోంది. నేరుగా ఉన్నతాధికారులే ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతో యూనియన్లు ఏమీ చేయలేకపోతున్నాయి. గతంలో ఉద్యోగికి ఏ కష్టం వచ్చినా ప్రతీదాంట్లో యూనియన్లు జోక్యం చేసుకుని తమ పలుకుబడిని ఉపయోగించి ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసేవారు. ప్రస్తుతం అలాంటివి జరగడం లేదని కిందిస్థాయి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

దీర్ఘకాలిక రుణాల రికవరీపై డీసీసీబీ కొరడా!

• ఏళ్లతరబడి చెల్లించని వారికి నోటీసులు • జిల్లాలో ఇప్పటివరకు నెలన్నరలో రూ.22 కోట్ల వసూలు
• నోటీసులకు స్పందించని వారి ఆస్తులను చట్టపరంగా వేలం వేసేందుకు సన్నద్ధం



నిజామాబాద్,ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దీర్ఘకాలిక రుణాలు తీసుకొని చెల్లించని వారిపై డీసీసీబీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఏళ్ల తరబడి చెల్లించకుండా వాయిదాలు వేస్తున్నవారికి నోటీసులు జారీచేశారు. నోటీసులకు స్పందించని రుణం తీసుకున్న వారిపై చట్టపర చర్యలకు సిద్ధమవుతున్నారు. లీగల్ నోటీసులు పంపడంతో పాటు రుణాలు తీసుకున్న సమయంలో వారు తనఖా పెట్టిన భూములు, ఇతర ఆస్తులను జప్తు చేస్తామని సమాచారాన్ని ఇస్తున్నారు. పెండింగ్ రుణాలన్నీ వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

• వడ్డీని 30 శాతం తగ్గించినా కాని రికవరీ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖల నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలో చాలామంది దీర్ఘకాలిక రుణాలను తీసుకున్నారు. కొంతమంది పదేళ్ల కింద తీసుకోగా మరికొంత మంది 5నుంచి పదేళ్ల సమయంలో తీసుకున్నారు. ఆ సమయంలో తమ వ్యవసాయ భూములతో పాటు ఇతర ఆస్తులను బ్యాంకు శాఖలలో తనఖా పెట్టారు. వీరు నిర్ణీత సమయంలో ప్రతీ సంవత్సరం వడ్డీతోపాటు అసలు చెల్లించాలి. రుణం పూర్తయిన తర్వాత కొత్తరుణాలు తీసుకోవాలి. కానీ గత ఐదేళ్లుగా ఎక్కువమంది ఈ రుణాలను చెల్లించలేదు. బ్యాంకు అధికారులు ఎన్నిసార్లు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం ఇచ్చి వడ్డీని 30 శాతం తగ్గించినా చెల్లింపులు చేయలేదు. రాజకీయ నేతల ద్వారా ఒత్తిళ్లు పెంచి రుణాలు చెల్లించకుండా దూరంగా ఉన్నారు.

• పెండింగ్‌లో రూ.142 కోట్లు

జిల్లాకేంద్ర బ్యాంకు శాఖల పరిధిలో జిల్లా పరిధిలో సుమారు రూ.142 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. రుణాలు రికవరీ చేయకపోవడంతో నాబార్డుతో పాటు ఇతర బ్యాంకుల నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం రావడం లేదు. చివరికి ఆర్‌బీఐ కూడా రుణ పరిమితిపై ఆంక్షలను విధించే పరిస్థితి వచ్చింది. ఏళ్లతరబడి సమావేశాలు నిర్వహించి దీర్ఘకాలిక రుణాలను చెల్లించాలని రుణగ్రహీతలకు నోటీసులు ఇచ్చిన స్పందించలేదు. వివిధ మార్గాల ద్వారా ఒత్తిళ్లు పెంచి చెల్లించకుండా దూరంగా ఉన్నారు. దీంతో బ్యాంకు లావాదేవీలకే ఇబ్బందులొచ్చాయి. రాష్ట్రంలో జిల్లాకేంద్ర సహకార బ్యాంకులు మొత్తం 10 ఉండగా ఉమ్మడి జిల్లా పరిధిలోని బ్యాంకు చివరి స్థానంలో రికవరీలో నిలిచింది. దీంతో పెండింగ్ రుణాలన్నీ వసూలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. గడిచిన రెండు నెలలుగా దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న 500మందికిపైగా నోటీసులను జారీ చేశారు. కొంతమంది స్పందించకుంటే వారి ఆస్తులను వేలం వేస్తామని నోటీసులను పంపిస్తున్నారు. ఒత్తిళ్లు వచ్చిన తప్పనిసరిగా పే చేయాలని అధికారులు విన్నవించడంతో చట్టపరమైన చర్యలకు సిద్ధమయ్యారు. ఈ నోటీసులకు స్పందించిన కొంత మంది రుణగ్రహీతలు ఈ నెలన్నర రోజుల్లో 22కోట్ల వరకు చెల్లించారు. మిగతావారు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖల ద్వారా రుణాలు తీసుకొని చెల్లించని వారందరికి నోటీసులు అందించేందుకు బ్యాంకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆర్‌బీఐ ఆంక్షల ప్రకారం రుణాలను వసూలు చేయడంతో పాటు కొత్తరుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఈ బ్యాంకులద్వారా డిపాజిట్ల సేకరణ, రుణాలు ఇవ్వడం, వసూలు వంటి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో చేయనున్నారు. ఆర్‌బీఐ ఇచ్చిన పరిమితి 3శాతం లోపే ఉండగా రుణాల రికవరీలో 15శాతంపైగా వెనకబడి ఉండగా బ్యాంకుకు నాబార్డు నుంచి, ఇతర సంస్థల నుంచి రావాల్సిన డబ్బులు రావడం లేదు. గతంలో ఉమ్మడిజిల్లా పరిధిలోని కేంద్ర సహకార బ్యాంకు రాష్ట్రాయిలో రెం డుమూడు స్థానాల్లో నిలువగా పెం డింగ్ రుణాల కారణంగా పదో స్థానానికి పడిపోయింది. కొత్తగా ఎ న్నికైన బ్యాంకు చైర్మన్ రమేష్‌రెడ్డితోపాటు డైరెక్టర్లు కూడా పూ ర్తిస్థాయిలో సహకారం అంది ంచేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. డీసీసీబీ పరిధిలోని పెండింగ్ రుణాల రికవరీపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని జిల్లా సహకార శాఖ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు తెలిపారు. పాలకవర్గాలు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేస్తే డీసీసీబీకి పూర్వవైభవం రావడంతో పాటు ఉమ్మడి జిల్లాలోని రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది.

పార్లమెంటు ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఇంటర్వ్యూ Interview

• తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు
• ప్రభుత్వ ఆదేశాతో సరఫరాపై ప్రతీరోజు సమీక్ష
• ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల ఏర్పాటు
• వడదెబ్బకు వైద్య సాయం అందేలా పీహెచ్‌సీలలో ఏర్పాట్లు
• 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పిస్తున్నాం. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాం. వేసవిలో ప్రధానమైన తాగునీటి సమస్యలతోపాటు ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. వడదెబ్బ, వ్యాధులు ప్రబలితే పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు అన్ని పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నాం. ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్న జిల్లా ఎన్నికల అధారిటీ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

• నిజామాబాద్ ప్రతినిధి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి:- పార్లమెంట్ ఎన్నికల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

కలెక్టర్:- కేంద్ర ఎన్నికలకమిషన్ ఆదేశాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో చర్యలను చేపట్టాం. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ఉద్యోగులకు ఎన్నికలకు అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. పార్లమెంట్ పరిధిలోని 1807 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు సిద్ధమవుతున్నాం. గత శాసనసభ ఎన్నికలకు తీసుకున్న విధంగానే ఈ పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లను చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:- పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీలున్నాయి. వీటిలో సమస్యాత్మక కేంద్రాలు కూడా ఉన్నాయి. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

కలెక్టర్:- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నాం. ఓటర్లకు అవగాహన కల్పించడంతోపాటు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వసతులు కల్పిస్తున్నాం. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ముందస్తుగా చర్యలను తీసుకుంటున్నాం. ఆ కేంద్రాల్లో బందోబస్తును పెంచడంతోపాటు ఎలాంటి గొడవలు జరుగకుండా చూసేందుకు ఏర్పాట్లను చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:- సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారా?

కలెక్టర్:- పార్లమెంట్ పరిధిలో ప్రతీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారితోపాటు సహాయ పోలింగ్ అధికారిని, ఉద్యోగులను నియమిస్తున్నాం. పోలింగ్‌కేంద్రాలకు అవసరమైన సిబ్బందితోపాటు అదనపు సిబ్బందిని కూడా నియమిస్తున్నాం. నియోజకవర్గాల వారిగా ఈవీఎంలపైన శిక్షణ ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:- నామినేషన్ల స్వీకరణ ఎప్పటినుంచి?

కలెక్టర్:- ఈనెల 18న నోటిఫికేషన్ ఇస్తాం. ఆరోజు నుంచి ఈనెల 25వరకు నామినేషన్లను స్వీకరిస్తాం. కలెక్టరేట్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లను స్వీకరిస్తాం.

ఆంధ్రజ్యోతి:- ఎన్నికల షెడ్యూల్‌లో బిజీ ఉన్నారు... వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నారా ?

కలెక్టర్:- ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి. అన్ని గ్రామాల్లో నీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఆర్‌డబ్ల్యుఎస్‌తోపాటు ఇతర శాఖల అధికారులను నియమించాం. మండలస్థాయిలో ఎంపీడీవో, తహశీల్దార్, ఎంపీవోతోపాటు ఇతర అధికారులకు బాధ్యతలను అప్పచెప్పాం. మిషన్‌భగీరథ నీటితో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:- జిల్లాలో తాగునీటి ఇబ్బంది ఉన్న గ్రామాలను గుర్తించారా? అక్కడ ఎలాంటి చర్యలను తీసుకుంటున్నారు.

కలెక్టర్:- జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేదు. ఎండలు ఇంకా పెరిగితే కొన్నిగ్రామాల్లో సమస్య వచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకు జిల్లాలో 37 వరకు తండాలను గుర్తించాం. వీటిలో మంచిప్ప ముంపు గ్రామాలకు సంబంధించిన 11తండాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో సమస్యలు లేవు. స్థానికంగా బోర్లు, ఇతర పైప్‌లైన్‌ల ద్వారా తాగునీరు అందుతోంది. ఒకవేళ ఇబ్బందులు తలెత్తితే ప్రైవేటుబోర్లను అద్దెకు తీసుకొని తాగునీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశాం. మిషన్‌భగీరథ ద్వారా అన్నిగ్రామాలకు తాగునీరు అందుతోంది. నిత్యం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షిస్తూ నీటి సరఫరా కొనసాగిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:- జిల్లాలో వరికోతలు మొదలయ్యాయి. ఎన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కలెక్టర్:- జిల్లాలో 468 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో నల్గొండ, నిజామాబాద్ రైతులు ముందస్తుగా వరి సాగుచేశారు. ఈ జిల్లాల్లోనే ఎక్కువగా వరి కోతలు మొదలయ్యాయి. అన్ని గ్రామాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను తెరిచాం. వ్యాపారుల నుంచి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:- కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు ఏమైనా తీసుకున్నారా?

కలెక్టర్:- జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లుచేశాం. రైతులు ధాన్యం తీసుకువచ్చి వెంటనే అమ్మకాలు చేసుకునేలా అన్ని వసతులను కల్పించాం. ఎండలు పెరిగినందున అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, వాహనాలను సమకూర్చాం. అవసరమైన టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాం. మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నాం. రైతులు ధాన్యాన్ని ఆరబోసి తేవాలి. తేమశాతం 17లోపు ఉండేలా చూసుకోవాలి. ఎండలు పెరిగినందున వడదెబ్బ తగిలినా ఇబ్బంది లేకుండా అన్ని కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచాం.

ఆంధ్రజ్యోతి:- వేసవి ఎండలు బాగా పెరిగాయి. గ్రామాల్లో వడదెబ్బలు తాకే అవకాశం ఉంది. ఇందుకు వైద్య ఆరోగ్య శాఖల ద్వారా చర్యలు చేపట్టారా?

కలెక్టర్:- ఎండలు ఒకేసారి భారీగా పెరిగాయి. పనులకు వచ్చే వారితోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి వడదెబ్బ తాకే అవకాశాలు ఉన్నాయి. అన్ని పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లను చేశాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతోపాటు మందులను అందుబాటులో ఉంచాం. గ్రామాల్లో కూడా ఆశావర్కర్ల వద్ద మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉంచాం. గ్రామంలో ఎవరైనా వడదెబ్బ బారిన పడితే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఇవ్వడంతో పాటు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించే విధంగా ఏర్పాట్లను చేశాం.

ఆంధ్రజ్యోతి:- గ్రామాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవు. ఉపాధి కల్పించేందుకు ఎలాంటి పనులు చేపట్టారు?

కలెక్టర్:- జిల్లాలో ఉపాధిహామీ ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి వంద రోజుల పనులు కల్పిస్తున్నాం. ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఎక్కువ మంది ఉపాధి హామీ పనులకు వస్తున్నారు. ఈ సంవత్సరం కూడా అన్ని గ్రామాల పరిధిలో పనులు కల్పించేందుకు ఏర్పాట్లను చేశాం. ప్రతిరోజు సమీక్షించడంతో పాటు పనులు ఎక్కువగా ఇచ్చే విధంగా చూస్తున్నాం. నిర్ణయించిన విధంగా ఉపాధి హామీ పనులను చేపడుతున్నాం.

పిడికిలి బిగించి సర్కారుపై కొట్లాడుదాం..

• క్వింటా వరిపై రూ.500 బోనస్ ఇవ్వాలి
• రైతుదీక్షలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 6: హామీల అమలుకు పిడికిలి బిగించి సర్కారుపై కొట్లాడుదామని బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. వరి క్వింటాకు అదనంగా 500 బోనస్ ఇవ్వాల ని ఆయన డిమాండ్ చేశారు. నగరంలోని పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్షా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల రుణమాఫీ, క్వింటాలుకు 500 బోనస్, ఎకరానికి 15వేల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 117 రోజులు దాటుతున్న వాటిని ఊసెత్తడం లేదు. అబద్దపు హామీలు ఇచ్చి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల కష్టాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు అధికారులను నియమించి పంట నష్టాన్ని అంచనావేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 500 బోనస్ ఇవ్వాలని, వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ విజీగౌడ్, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నగర అధ్యక్షుడు సిర్పరాజు, కార్యదర్శి ఎనగందుల మురళి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్య ప్రకాశ్, చింతమహేష్, పాల్డా ప్రశాకర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బీజేపీ పాలనలో విప్లవాత్మక విజయాలు

• బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎంపీ అర్వింద్



కార్యకర్తలతో భోజనం చేస్తున్న ఎంపీ అర్వింద్

పెద్దబజార్, ఏప్రిల్6: బీజేపీ పదేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక విజయాలు సాధ్యమయ్యాయని ఎంపీ అర్వింద్ అన్నారు. భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి చేతుల మీదుగా జెండా ఎగరవేశారు. ఎంపీ అర్వింద్ పార్టీ కార్యకర్తలకు స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం నగరంలోని ప్రగతినగర్‌లో 36వ పోలింగ్ బూత్‌కు సంబంధించి హనుమాన్ మందిరం వద్ద జెండా ఎగరవేశారు. పార్టీ కార్యకర్తలతో కలిసి వినాయక్‌నగర్‌లోని మున్నూరుకాపు సంఘంలో టిఫిన్ బైటక్‌లో ఎంపీ పాల్గొన్నారు. మధ్యాహ్నం ముఖ్యనేతలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి చాయ్ అమ్ముకున్న వ్యక్తిని దేశప్రధానిగా చేసిన ఘనత బీజేపీ పార్టీకే దక్కుతుందన్నారు. కుల, మత, లింగ వివక్ష లేకుండా అన్నివర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. పదేళ్ల బీజేపీ పాలన చూస్తే అనేక విప్లవాత్మక విజయాలు సాధించామన్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు, చట్టసభలో మహిళల రిజర్వేషన్, సీఏఏ, త్రిబుల్‌తలాక్ రద్దు చేశామన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాజ్ యోజన, గరీబ్ అన్న కళ్యాణ్‌యోజన, ఆయుష్మాన్ భారత్, ఫసల్ భీమాయోజన, ఉజ్వల యో జన, సుఖన్యసమృద్ధి యోజన, ముద్ర లోన్స్, కరోనా వ్యాక్సిన్ ఇతర అనేక సంక్షేమ పథకాలు తెచ్చినట్లు చెప్పారు. భారత్‌దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలన్న శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దీన్‌దయాల్ ఉపాధ్యాయ అటల్‌జీ, అద్వానీల కల సాకారం చేయాలని ఈ దేశాన్ని అఖండ భారతదేశంగా తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, బంటురాము, పోతన్‌కర్‌లక్ష్మినారాయణ, మాస్టర్ శంకర్, రోషన్‌లాల్‌బోరా, దొంతుల రవి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

ఇందల్వాయి, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో శనివారం సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఎస్సై మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు సైబర్ నేరాలపట్ల ఇందల్వాయి పోలీసులు, బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తుక్కుగూడ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ తుక్కు గూడ సభకు వెళ్లిన డిచ్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 6: రానున్న పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసిన హైదరాబాద్ తుక్కుగూడ సభకు డిచ్‌పల్లి మండలం నుంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం సుమారు 100మంది తరలివెళ్లారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలు చేసిన విధంగానే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యారెంటీలను అమలు చేస్తోందని అమృతాపూర్ గంగాధర్ అన్నారు. సభకు తరలిన వారిలో కూరపాటి గంగాధర్, కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, ధర్మగౌడ్,నవీన్ గౌడ్ తదిత రులు ఉన్నారు.

డ్రగ్స్ కేసులో అరెస్టు అయిన అధ్యాపకుడిని సమగ్ర విచారణ చేయాలి

● గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీను నాయక్

డిచ్‌పల్లి,ఏప్రిల్ 6: తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం సహాయ ఆచార్యుడు మత్తు పదార్థాల తయారీ పట్టుబడటం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతునట్లు ఇటీవల వచ్చిన వార్త కథనాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి స్థాయి విద్యార్థులు చదువుకుంటున్న యూనివర్సిటీలో ఇలాంటి ఘటనలు జరగడం మాయని మచ్చలాంటిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని, ఈ ఘటనలో ఏవ రెవరు పాత్ర ఉందో నిగ్గ తేల్చి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా మహాపూజ

ధర్పల్లి ఏప్రిల్6: మండంలోని కాలేజ్‌తండాలో హన్మాన్ భక్తులు మహాపూజలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహాపూజకు ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి సిరికొండ మండలాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గణపతిపూజ, హన్మాన్ పూజ, యజ్ఞం నిర్వహించారు. హన్మాన్ జయంతి సందర్భంగా కొండగట్టుకు భక్తులు కాలినడకన వెళ్లనున్నారు. ప్రతీరోజు మాలధారులైన హన్మాన్ భక్తులు నియమనిష్టలతో పూజలు చేస్తున్నారు. ఈకార్యక్రమంలో స్వాములు కమ్మరి గంగాధర్, నరేష్, వీరేందర్, రాణా, భక్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలి

ధర్పల్లి ఏప్రిల్6: విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్‌సాహెబ్ అన్నారు. శనివారం పాఠశాలలోని విద్యార్థులను ఉచితంగా ఒక రోజు విహారయాత్రకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పోచంపాడ్ జల విద్యుత్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తిపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిర్మల్‌లో చెక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని తీసుకువెళ్లి చెక్కబోమ్మల విశిష్ఠతను వివరించారు. పాఠశాలకు చెందిన ఆరు నుంచి 9తరగతి విద్యార్థులను విహారయాత్రకు తీసుకువెళ్లినట్టు తెలిపారు.

చట్టాలపై అవగాహన

బోధన్‌రూరల్,ఏప్రిల్6: బోధన్ కోర్టు ప్రాంగణంలో శనివారం చట్టాలపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు బోధన్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌రావు, డాక్టర్ సమ్మయ్య, బోధన్ సీఐ వీరయ్య, రూరల్ సీఐ పోల నరేష్, రుద్రూర్ సీఐ జయేష్‌రెడ్డి, బోధన్ ఎక్సైజ్‌ఎస్‌ఐ ఎండీ జలీలుద్దీన్,ఎడపల్లి ఎస్‌ఐ వంశీకృష్ణ, రుద్రూర్ ఎస్‌ఐ అప్పారావు, రెంజల్ ఎస్‌ఐ సాయన్న, వర్ని ఎస్‌ఐ కృష్ణకుమార్, అటవీ శాఖ అధికారి కే.బాబు, లైసెనింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

కోటగిరి,ఏప్రిల్6: పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు, పాఠశాల విద్యార్థులకు శనివారం వడదెబ్బ నివారణపై ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ సేపు ఎండలో ఉండకుండా పని చేయాలన్నారు. డీహైడ్రేషన్ కాకుండా ఎప్పటికప్పుడు నీటిని తాగాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఎండలో తిరగకుండా, ఆటలు ఆడకుండా ఉండాలని సూచించారు. మాధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ఇంటిలోనే ఉండాన్నారు. వడదెబ్బవల్ల వచ్చే అనర్థాలపై వివరించారు. ఎక్కువగా నీటిని సేవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌గౌడ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్6: రాజ్యాంగాన్ని మార్చే వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. శనివారం జక్రాన్‌పల్లిలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు మనువధులు రాజ్యంగం స్థానంలో మధుదర్మ రాజ్యాంగాన్ని తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వారికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలమహ నాడు అధ్యక్షుడు కిరణ్, నిజామాబాద్‌రూరల్ అధ్యక్షుడు గంగారాం, మాలమహనాయడు నాయకుడు భాస్కర్, మాణిక్యం, దిలీప్, గంగారాం, బుయ్యా గంగన్న, హరిష్, సోలమన్, తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుడాలి : ఎస్‌ఐ

మోపాల్, ఏప్రిల్ 6:యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని మోపాల్ ఎస్సై గంగాధర్ అన్నారు. శనివారం మోపాల్ మండల కేంద్రంలో కెంపు అశోక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని అశోక్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఒక్క వాటర్ బాటిల్ కొనాలంటే రూ.20 అవుతుందని తెలిపారు. మోపాల్ మండల కేంద్రానికి వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు ఎక్కువగా జరుగుతున్నందున గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆయా గ్రామాల ప్రజలు కూడా అశోక్‌ను స్ఫూర్తిగా తీసుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి, గణపతి, కెంపు సాయిలు, కెంపు సతీష్, ప్రవీణ్, సాయరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సంతోష్, లక్ష్మీనర్సయ్య, చిన్నయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అమలుకు నోచుకోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

సిరికొండ ఏప్రిల్ 6 : గత శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆచరణలో అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. సిరికొండ మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్లమెంటు ఎన్నికల సన్నాహ సమావేశంలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు చేరువయ్యిందన్నారు. బీఆర్ఎస్‌ను అందులో బలమైన నాయకుడు కేసీఆర్‌ను ఓడించాలంటే ప్రజలు నమ్మే హామీలను ప్రకటించాలని భావించి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో 420 హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రైతులకు ఎకరాన పదిహేను వేలు వేయడం పక్కన బెడితే ఐదెకరాల లోపు రైతులకు రైతుబంధు వేయడానికై అపసోపానాలు పడుతున్నరని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జడ్‌పీ చైర్మన్ దాదన్న గారి విఠల్, మాజీ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.జీ. గౌడ్ , జడ్‌పీటీసీ సభ్యులు బాజిరెడ్డి జగన్, మాజీ జడ్‌పీటీసీ సభ్యులు బేల్దారి గోవర్దన్, గంగారెడ్డి,రాజగంగయ్య,మంజుల,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

● ఎంపీడీవో గోపాల కృష్ణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో దృశ్యం

ఎడపల్లి, ఏప్రిల్ 6: వేసవి కాలంలో మండల ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి గోపాల కృష్ణ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోగల ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో తాగునీటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన ఏఏ గ్రామాలలో తాగునీటి సమస్య ఉందో, మిషన్ భగీరథ నీరు ఎంతమేర వస్తుందోనని, ఏఏ గ్రామాలలో నీటి ఎద్దడి ఉందో పంచాయతీ కార్యదర్శులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడతూ మండలంలో ముఖ్యంగా ఐదు గ్రామాలకు నీటి కొరత ఉందని, ఆ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు కొన్ని సాంకేతిక కారణాల వల్ల సరఫరా కావడంలేదని ఆయన తెలిపారు. అన్ని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యగా బోరు మోటారులను ఆందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏఏ గ్రామాలలో మిషన్ భగీరథ నీరు తక్కువగా వస్తుందో ఆ గ్రామాల కార్యదర్శులు మిషన్ భగీరథ ఏఈతో మాట్లాడి డిమాండ్ ప్రకారం గ్రామానికి నీటి సరఫరా అయ్యే విదంగా చూడాలన్నారు. బోరు బావులు అందుబాటులో లేని గ్రామాలలో గ్రామానికి దగ్గరగా ఉన్న రైతులతో మాట్లాడి వారి బోరు మోటారు ద్వారా గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అలా ముందుకు వచ్చిన రైతులకు బోరు మోటారుకు అద్దె ప్రభుత్వం చెలిస్తోందని ఆయన సూచించారు. అంతకు ముందు మండల ప్రత్యేక అధికారి నంద కుమారితో కలిసి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం, ధర్మారం గ్రామాల్లో జరుగుతున్న నీటి సరఫరా, ట్యాంకుల సామర్థ్యం, వాటి నిర్వహణ, ఆయా గ్రామాల కార్యదర్శులను, నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ వాటర్ సర్వీస్ ఏఈ గబ్బర్ సింగ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, ఉదయ భాస్కర్, సాయి, మిషన్ భగీరథ సూపర్‌వైజర్ ఇస్తారి, తదితరులు ఉన్నారు.

రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి

● వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్



రోగులతో మాట్లాడుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్6: రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ అన్నారు. శనివారం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యుల సేవలు ఎలా ఉన్నాయంటూ రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరు బయోమెట్రిక్ విధానాన్ని పాటించాలని విధుల్లో తప్పకుండా హజరుకావాలన్నారు. రోగులకు మానవత దృక్పదంతో వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో ప్రేమగా మాట్లాడి రోగాల నయం కోసం కావాల్సిన మందులను అందజేయాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు తాగునీరు అందించేందుకు పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలోని డయాలసిస్ విభాగాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బ్లడ్‌బ్యాంక్‌లో అవసరమైన అన్ని రకాల గ్రూప్ రక్తాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. చిన్నారులకు ప్రత్యేకమైన వైద్య సేవలందించాలన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందు వైద్యులు విధులు నిర్వహించాలన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వైద్య సిబ్బంది ఎటువంటి సెలవులు తీసుకోకుండా రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వం అందించే వైద్య సదుపాయలను రోగులకు తప్పకుండా అందించి వారి ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శివశంకర్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాహుల్, ఆర్‌ఎంవో డాక్టర్ రహీమ్, డాక్టర్ సందీప్, డాక్టర్ బల్‌వీర్‌సింగ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఏప్రిల్6: బోధన్, సాలూర మండలాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఉదయ్ కుమార్, కృష్ణవేణిలు అన్నారు. శనివారం బోధన్ మండల పరిషత్ సమావేశపు మందిరంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని, వేసవిలో ప్రజలకు తాగునీటిలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించి ప్రతి రోజు ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఎంపీవో మధుకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేనిపక్షంలో కార్యదర్శులపై చర్యలు తప్పవని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా హెచ్చరించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రెండు నెల ల పాటు గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలలో అవసరమైతే వ్యవసాయ బోరు మోటార్లు వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైతే తప్ప కార్యదర్శులు సెలవులు పెట్టరాదని సూచించారు. తాగునీటి సమస్యతో పాటు గ్రామాలలో పారిశుధ్య సమస్యలపై తగిన దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతీ తదితరులున్నారు.

మోపాల్:గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని ఈ సమస్య రాకుండా గ్రామస్థాయి అధికారులు చూడాలన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో ఉన్న ప్రత్యేక అధికారులు నీటిసమస్యపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధర్పల్లి: గ్రామాల్లో నీటి కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలం లోని మద్దుర్‌తండాలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భం గా తండావాసులను తాగునీరు సరఫరాపై అడిగితెలుసుకున్నారు. అనం తరం మండల పరిషత్ కార్యాలయంలో మంచి నీటి సరఫరాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కావోద్దని ఆయన తెలిపారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భూగర్భజలాలు అడుగంటిన పరిస్థితుల్లో కార్యదర్శులు స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, తహసీల్దార్ మాలతి, వ్యవసాయాధికారి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సాయిబాబా

ఎండ కాలంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

రుద్రూరు: ఎండకాలంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శశికళ ఆదేశించారు. రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో శనివారం వాటర్ ట్యాంకులను పరిశీలించారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నీటి సమస్య ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: వేసవి కాలం ముగిసే వరకు గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై పంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి. ఎంపీవో యుసుఫ్‌ఖాన్, గ్రామప్రత్యేక అధికారులు, పంచాయతీకార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఎండలు మండుతున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమ్మర్‌పల్లి మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ ఆదేశించారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో మండల గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరత అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ మాట్లాడుతు గ్రామాలలో తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టి సారిస్తూ పైపలీకేజీలు ఎప్పటికప్పుడు సరిచేస్తూ ప్రతి వార్డులో ఇంటింటికి తాగునీరందేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమాత్ర నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉంటాయని సూచించారు. సమావేశంలో ఎంపీ రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు, మండలస్థాయి అధికారులు, మండల పంచాయితి ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● నాగాపూర్ గ్రామాన్ని సందర్శించిన పీడీ

మండలంలోని నాగాపూర్ గ్రామాన్ని కమ్మర్‌పల్లిలోని గాంధీనగర్ వడ్డర కాలనీలను డిఆర్‌డివో పిడి సాయాగౌడ్ సందర్శించి పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా విషయమై గ్రామస్థులు కాలనివాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ నర్సరీలను ఆయన పరిశీలించారు.

కర్షక్ మిత్రను సద్వినియోగం చేసుకోవాలి

ధర్పల్లి ఏప్రిల్6: కర్షక్ మిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌డీసీసీబీ ధర్పల్లి శాఖ మేనేజర్ కాశీనాథ్ శనివారం తెలిపారు. కర్షక్ మిత్ర పథకంలో భాగంగా రైతులకు ఎకరానికి రూ.లక్షన్నర చొప్పున ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. రూ.10లక్షలకు మించకుండా ఈ పథకాన్ని రైతులకు వర్తింపజేయనున్నట్టు ఆయన తెలిపారు. తమ బ్యాంకులో హౌజింగ్‌లోన్‌లు సైతం ఖాతాదారులకు ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. మండల కేంద్రంలో రూ.30లక్షల వరకు, గ్రామీణ ప్రాంతంలో రూ.25లక్షల మేరకు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,ఏప్రిల్6: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ సీఐ నాగనాథ్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని పెద్ద మావంది గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. మండలంలోని గ్రామాలలో పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్6: బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో పంచవటి సూపర్ మార్కెట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మృతదేహన్ని జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతదేహనికి సుమారు 35సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహన్ని గుర్తించిన వారు బోధన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతి గల కారణాలను అన్ని కోణాల్లో సీసీ పుటేజీల ద్వారా విచారణ చేపడుతున్నామన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకా తప్పనిసరి



డొంకేశ్వర్‌లో పశువులకు టీకా వేస్తున్న మండల పశువైద్యాధికారి

డొంకేశ్వర్ ఏప్రిల్6: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని డొంకేశ్వర్ మండల పశువైద్యాధికారి హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని, ఈ వ్యాధి సోకిన పశువులకు నోటిలో, కాళ్లలో, పండ్లు ఏర్పడి మేతమేయక నడవలేక నిరసిస్తాయన్నారు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పడిపోతుందని, వ్యాధి సోకిన పశువులకు చికిత్స చేయకుంటే మరణిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కిష్టయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు తప్పవు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్6: మండలంలో 44వజాతీయరహదారిపై, ఇతర రహదారులపై ధాన్యం ఆరబెట్టి వాహనదారులకు ఇబ్బంది కలుగజేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సిహెచ్.తిరుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దని, కల్లెంలో ధాన్యంను ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి,ఏప్రిల్ 6:స్టేట్ బ్యాంక్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచితంగా బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు ఇందుకోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నమని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన నిరుద్యోగ గ్రామీణ ప్రాంత మహిళలు, నిరుద్యోగులు ఈ ఆవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయనకోరారు. పురుషులకు సెల్‌ఫోన్ రిపేర్, ఎలక్ట్రీషియన్, కారు డ్రైవింగ్ మెకానిక్, ఫొటో మరియు వీడియోగ్రఫీలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు 19-45 ఏళ్ల వయస్సు కలిగి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో ఆధార్, రేషన్, ఎస్సెస్సీ, పత్రాల నకళ్లు, 5 పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈఉచిత శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి ఉంటుందన్నారు.మరిన్ని వివరాలకు 08461-295428 నంబరుకు సంప్రదించాలని డైరెక్టర్ కోరారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ఏర్గట్ల, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా కమ్మర్‌పల్లిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళానాన్ని విజయవంతం చేయాలని ఏర్గట్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడతూ ఏర్గట్ల మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు తరలిరావాలని, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతీ కార్యకర్త బీఆర్ఎస్ ఎంపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బద్దం ప్రభాకర్, నాగిరెడ్డి రాజేంధర్, ఓర్సు రాములు, రాజారం సహదేవ్, నర్సయ్య, ఎలేటి బాలకిషన్‌లు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ బంజారా గిరిజన ఆత్మీయ సదస్సు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 6: బర్ధిపూర్ శివారులోని బృందావనం గార్డెన్‌లో నేడు కాంగ్రెస్ పార్టీ జిల్లా బంజార గిరిజన ఆత్మీయ సదస్సు జరగనుందని మండల కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్,ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి మండ వ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ, రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ తేజావత్ బెల్ల య్య నాయక్‌లు హాజరువుతున్నట్లు వారు పేర్కొన్నారు. కావునఈ కార్యక్రమానికి నిజామాబాద్‌రూరల్ గిరిజన సోదరులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

పలు వార్డుల్లో భూగర్భజలాల పరిశీలన

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్6: మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో శనివారం మున్సిపల్ కమిషనర్ రాజు భూగర్భజలాలను పరిశీలించారు. పలు వార్డుల్లోని ప్రభుత్వ బోరుబావులను పరిశీలించి కాలనీలోని ప్రజలను నీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ రఘు, సిబ్బంది శ్రీనివాస్, తదిత రులు ఉన్నారు.

ఏర్గట్లలో ఓపీవోలకు ఎలక్షన్ శిక్షణ

ఏర్గట్ల, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఓపీవోలకు ఎలక్షన్‌కు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ ప్రభాకర్ ఓపీవోలకు ఎలక్షన్ బూత్‌లో నిర్వహించాల్సిన విధులపై వారికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ యాసుఫ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ సదానంద్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఈజీఎస్, ఐకేపి ఉద్యోగులు పాల్గొన్నారు.

గుండారంలో "ఉగాది బాల కవిసమ్మేళనం"

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 6: రూరల్ మండలం గుండారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. శనివారం పాఠశాలలోని విద్యార్థులకు క్రోధినామ నూతన సంవత్సరం సందర్భంగా బాల కవి సమ్మేళనం నిర్వహించారు. మామిడి తోరణాలు, ఉగాది పచ్చళ్ల మధ్య పల్లె సంస్కృతిని ప్రతిబింబించేలా తరగతి గదులను తీర్చిదిద్దారు. 9వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులు లాస్య, కృష్ణవేణి, నిహారిక, శ్రుతిరెడ్డి, సంజన, ఇందు, సాత్విక, గంగాలక్ష్మి, నందిత, లక్షయ, శ్రీవేణి, వైశాలి తదితర విద్యార్థులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఉత్తమ కవితలు చదివిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ దస్తగిరి, డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, జి.అమర్‌నాథ్, శ్రీపాద, గిరిధర్, ఆరోగ్యరాజ్, వినోద్‌కుమార్, నాందేవ్, పుష్పలత, మోనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలి



ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బోధన్‌రూరల్,ఏప్రిల్6: ఎన్నికల నియమ, నిబంధనలు తప్పకుండా పాటించి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని బోధన్ తహసీల్దార్ గంగాధర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై ఉపాధ్యాయులు పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని సూచించారు. పోలింగ్ నిర్వహించే విధానంతో పాటు సంబంధిత శిక్షణలో భాగంగా పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల నియమ, నిబంధనలపై ప్రతి ఒక్కరు పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వరుణ్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్6: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విధుల పట్ల నిర్లక్ష్యంచేస్తే చర్యలుతప్పవని తహసీల్దార్ కిరణ్మాయి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఓపీవోలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో అధికారులు తప్పనిసరిగా తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికలపై ఓపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ ప్రవీన్, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మోర్తాడ్‌కు ఎంపీ సురేష్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రాక

మోర్తాడ్, ఏప్రిల్6: మండలంలోని మోర్తాడ్ గ్రామశివారులోని లలిత గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక ముఖ్యకార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్లెడ ఏలియా తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ప్రస్తుత ఎంపీ కేఆర్.సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వీజీ.గౌడ్‌లతో పాటు ఇతర నాయకులు విచ్చేస్తున్నారని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి మండలంలోని నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు

జంబి హన్మాన్ ఆలయంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్6: పట్టణంలోని జంబిహన్మాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ప్రతీ శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గోర్త దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అన్నదానంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


అంకాపూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


కోటగిరిలో ..


మామిడిపల్లిలో ...

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్‌6: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400సీట్లు సాధించి చరిత్ర సృష్టించడం ఖాయమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ విజయం వెనుక కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు పాలెపు రాజు, రోహిత్‌రెడ్డి, నరేష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబజార్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే డిసెంబర్ 9న రైతులకు 2లక్షల రుణమాఫీ అందజేస్తామని అబద్ధపు ప్రచారం చేశారని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ అన్నారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దోచుకున్న సొమ్మును దక్షిణ తెలంగాణకు ముఖ్యంగా కొడంగల్ ప్రాంతానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాధనాన్ని ఆయన సొంత నియోజకవర్గానికి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికి రుణమాఫీ చేయలేదన్నారు.సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి పటేల్, రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మెండోర: ప్రపంచంలోనే అదిపెత్త పార్టీగా భారతీయ జనతాపార్టీ అవతరించిందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ అన్నారు. శనివారం మండలంలో పోచంపాడ్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఎగురవేసి ఆసుపత్రి ఆవరణలో పరిసరాలను శుభ్రం చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు, బీజేవైఎం మండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: మూడోసారి హ్యాట్రిక్ ప్రధానిగా మోడీ విజయం సాధించడం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకులు నరసింహ రెడ్డి అన్నారు. శనివారం బోధన్‌లో బీజేపీ ఆవిర్భా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రైల్వేగేట్ వద్ద బీజేపీ జెండా ఆవిష్కరించి హనుమాన్ టెకిడిలో టిఫిక్ బాక్స్ బైఠాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మాసిని వినోద్, బీజేపీ నాయకులు గొడుగు ధర్మపురి, హన్మాండ్లు చారి, వాసు, అరవింద్, సింధి విజయ్, మోహన్, గుంట గంగాధర్, రమణా చారి, గంగాధర్, కృష్ణ, గౌతం గౌడ్, పోశెట్టి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మోపాల్: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ఐదవ డివిజన్ బోర్గాం(పి) గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఆదేశాల మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదల నరేష్, తోట శాస్త్రి, తోపారం భాస్కర్, రచ్చ ఆనంద్, చిట్టి పండరి తదితరులు పాల్గొన్నారు

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ముప్కాల్, బాల్కొండ మండలంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ముప్కాల్ మండల కేంద్రంలోని గాంధీచౌరస్తా వద్ద బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మకిషన్, నాయకుడు సంతోష్, ముస్కు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజ్,సంతోష్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సరిన్, మహిళ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి సవిత, ఎంపీటీసీ రాధ, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గోల్‌బంగ్లా, శివాజీచౌక్ వద్ద బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీమున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, పొల్కం వేణు, ఆరే రాజేశ్వర్, ఆకుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంతో పాటు రాయకూర్, చిక్కడపల్లి, రాణంపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బీజేపీ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీడీ సాయిలు, ఈరోళ్ల గంగాధర్, నాగరాజు, నారాయణరావు, పోశెట్టి, రుద్రూరు మండల బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని పలు గ్రామాలలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కుంట శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి సాయన్న, జైడి గంగారెడ్డి, కోరం ప్రకాష్, బోగ దేవేందర్, గంగామోహన్, శేఖర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని పాత బస్టాండు వద్ద శనివారం 44వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బోధన్ నియోజకవర్గ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకుడు కీసరి శంకర్ గౌడ్, మల్లెపూల శ్రీనివాస్, నాయిని సతీష్ గౌడ్, బర్దిపూర్ ప్రణయ్, లక్ష్మన్ గౌడ్, ద్యాకం సాయిలు, కంజర్ ప్రదీప్ కుమార్, సాయి తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదల కోసం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అభ్యర్థించాలని కార్యకర్తలకు సూచించారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరు కష్టపడి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ను గెలిపించేలా కృషి చేయాలని ఆయన కోరారు.

సిరికొండ: బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సిరికొండ మండలంలో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, రామడుగులో జిల్లా కార్యదర్శి నక్కా రాజేశ్వర్, కొండాపూర్ మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ రుమాండ్ల శ్రీనివాస్ బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, మండల అధ్యక్షుడు సురేందర్, బీజేపీ నాయకులు సాగర్, ఐలాపురం సాయికుమార్,మహిపాల్,సుమన్,సాయన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలి'

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,ఏప్రిల్‌6:విద్యార్థుల ఉజ్వల అభ్యున్నతికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి షైచాంప్స్ ఇండియా ఆర్గనైజేషన్ నిర్వహించిన ఒలంపిడ్ పరీక్షల్లో మొదటి, రెండో ర్యాంక్ సాధించిన విజయ సాయి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే విద్య సంవత్సరంలో విద్యార్థులకు ఉపయోగపడే ఎలక్ట్రికల్ పరికరాలను, ట్యాబ్,లాప్‌ట్యాప్‌లను బహుకరించారు. ఇంగ్లీష్ సబ్జెక్టు నందు ర్యాంకు సాధించిన లోకేష్ పాటిల్, సీహెచ్ కీర్తనలను ల్యాప్‌టాప్‌లతో పాటు సర్టిఫికేట్లు, మెమోంటోలను ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ మందుల పంపిణీ


మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖిల్లా, ఏప్రిల్ 6 : ట్రాఫిక్ సిబ్బందికి వడదెబ్బ తగుల కుండా ఉండేందుకు హోమియో మందులను పంపిణీ చేస్తున్నామని అడిషనల్ డీసీపీ అడ్మిన్ కోటేశ్వర్‌రావ్ అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ మందులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది ఎండలో విధులు నిర్వహిస్తుంటారని వారు ఎక్కువ సమయం ఎండలో ఉంటారని వారికి వడదెబ్బ నివారణ కోసం మందులను పంపిణి చేయడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ. ఏ.నారయణ, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారాయణ, ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో, రోటరీక్లబ్ ప్రతినిధులు హోమియోపతి డాక్టర్ గోపికృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో అదనపు సెక్షన్‌లను మంజూరు చేయాలి

● కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్‌కు ఎంపీ అర్వింద్ లేఖ

పెద్దబజార్, ఏప్రిల్ 6: నిజామాబాద్ కేంద్రీయ విద్యాలయంలో అదనపు సెక్షన్‌లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్‌కు శనివారం ఎంపీ అర్వింద్ లేఖ రాశారు. గత కొన్నేళ్లుగా నాగారంలోని డైట్ కళాశాలలో తాత్కాలికంగా కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయం, భవన నిర్మాణం పనులు పూర్తి చేసుకోవడంతో ఏప్రిల్ 1 నుంచి కొత్త భవనంలోకి మారిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న తరగతులకు ఒక సెక్షన్ మాత్రమే ఉందని రెండవ సెక్షన్ మంజూరు చేస్తే మరింత ఎక్కువ మంది విద్యార్థులకు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో విద్యనభ్యసించే అవకాశం ఉంటుందని ఆయన కోరారు. గతంలో 1వ తరగతిలో 42 సీట్లు ఉండేవని ఇప్పుడు 32కు తగ్గిందన్నారు. కేంద్రీయ విద్యాలయంలో ఎంపీ కోటా ఉన్నప్పుడే కార్యాలయానికి 350 వరకు అప్లికేషన్ వచ్చాయని ఇలాంటి విద్యాలయాల్లో అడ్మిషన్లకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉందన్నారు.

ఇద్దరు మట్కారాయుళ్ల అరెస్టు

● రూ.2600లు స్వాధీనం

ఖిల్లా, ఏప్రిల్ 6: ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను రెండో టౌన్ పోలీసులు పట్టుకుని కేసునమోదు చేశారు. నగరంలోని పెద్ద బజార్ వద్ద గల ఓహోటల్‌లో అనుమానాస్పదంగా కూర్చుని ఉన్న అస్లం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ఆయన సెల్‌ఫోన్‌లో ఇతరులతో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అస్లం సెల్‌ఫోన్ నుంచి జుబేర్ అనే వ్యక్తికి ఆన్‌లైన్‌లో మట్కానంబర్లను పంపినట్లు పోలీసులు గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2600ల నగదును స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు రెండో టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ ఎల్.రామ్ తెలిపారు.

వేసవిలో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలి

ఏర్గట్ల,ఏప్రిల్ 6:వేసవిలో ప్రజలకు తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని డీఎల్‌పీవో,మండల ప్రత్యేకాధిరి శివకృష్ణ తెలిపారు.శనివారం మండలంలోని తాళ్లరాంపూర్,దోంచంద గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌లను పరిశీలించి ఇండ్ల యజమానులతో మాట్లాడారు. అనంతరం జీపీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి నీటి సమస్యలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్,ఎంపీడీవో, ఎంపీవో,కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

రెంజల్,ఏప్రిల్6: నేటి కాలంలో సైబర్ క్రైమ్‌లు అధికమవుతున్నాయని వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సైబర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట లక్ష్మి అన్నారు. శనివారం దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ అంబసిడర్ ఫ్లాట్ ఫామ్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ వాడకంలో జరుగుతున్న మోసాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలపై అందరు అవగాహన కలిగిఉండాలన్న ఉద్దేశంతో సైబర్ అంబసిడర్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. విద్యార్థులు మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువుపైనే దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రభాకర్, గణేష్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు , ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

● వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి ● రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలి: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


పోరుబాటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్‌6: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మాజీమంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రైతుల కోసం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి, ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖార్గే సాక్షిగా ఎంఎస్‌పీ ధర కంటే అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. రైతులకు రూ.2లక్షల వ్యవసాయ రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పుడు దాని ఊసే ఎత్తడంలేదని అన్నారు. ఎంపీ ఎన్నికలకు ముందే గతంలో ఇచ్చిన హామీలు సరిగా అమలు చేయని కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓటు వేస్తే హామీలు అమలు చేస్తారా అన్న విషయాన్ని ప్రజలు, రైతులు ఆలోచించాల న్నారు. గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్ పదేళ్లలో రాష్ట్రంలో, తన నియోజక వర్గంలో తాను రైతాంగానికి ఏలాంటి ఇబ్బందులు కలగకుం డా చూసుకున్నామని ప్రశాంత్‌రెడ్డి గుర్తు చేశారు. సాగునీరు, కరెం టు, పంటల కొనుగోలు, రైతు బంధు విషయంలో రైతులు రోడ్డెక్కిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్ని కష్టాలే మొదలయ్యాయని అన్నారు. గతంలో పసుపుబోర్డు తీసుకువ స్తానని హామీ ఇచ్చిన ఎంపీ అర్వింద్ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పసుపుబోర్డు తీసుకురాలేద న్నారు. పసుపు బోర్డు సాధించామని ఎంపీ చెబుతున్నారని, పసుపు బోర్డు ఎక్కడ ఎప్పుడు ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని ఎమ్మె ల్యే ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో వేల్పూర్, బాల్కొండ, మెండోర, ముప్కాల్ మండలాలకు చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

● జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 6: పోలింగ్, కౌంటింగ్ కవరేజీ కోసం ఎ న్నికల కమిషన్ ద్వారా మీడియా పా సులు పొందనున్న మీడియా ప్రతినిధులకు కూడా ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓ టుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిం దని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. అయితే పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలు పడని వారు పోస్టల్ బ్యా లెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈనెల 20లోగా సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పిం చే ఫారం-12(డి)లను మాత్ర మే పరిగణలోకి తీసుకొని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించడం జరు గుతుందన్నారు.ఫారం-12(డి) దరఖాస్తులు నో డల్ అధికారి కార్యాలయంతో పాటు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, డీపీఆర్‌వో కార్యాలయం నుంచి పొందవచ్చని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి సైతం డౌన్‌లోడ్ చేసుకొని నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకున్నవారు సం బంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉం టుందన్నారు. ఈ మేర కు రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్‌ను అందుబాటులో ఉంచుతామని, హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక సారి పోస్టల్ బ్యాలెట్‌లో నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చే సుకున్నవారికి ఎట్టి పరిస్థితిలో పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించబడదని ఓటరు జాబితాలో వారి పేరును పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్‌చేయ డం జరుగుతుందన్నారు. కావున పోస్టల్ బ్యా లెట్ వినియోగించదల్చిన మీడి యా ప్రతినిధులుడీపీఆర్‌వో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్ సా.6.35	సహర్ ఉ.4.42



అల్లాహ్ ఒక దాసుడిని తన ప్రితమునిగా చేసుకున్నప్పుడు అతనికి మృదు స్వభావాన్ని ప్రసాదిస్తాడు.

గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

● స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్


మద్దెపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

నవీపేట,ఏప్రిల్‌6: వేసవికాలం దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో తాగునీటి కొరత లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం మండలంలోని మట్టయ్య ఫారం తండా, మద్దెపల్లి తండాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో తాగునీటి సరఫరా గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన బోరు మోటార్లు ఎక్కడైన చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయాలని, తాగునీటి ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే మద్దెపల్లిలోని యూపీఎస్ పాఠశాల, నవీపేటలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలను సందర్శించి అమ్మ పాఠశాలకు సంబంధించి చేపట్టేబోయే అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, పంచాయతీ రాజ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు



సీడీపీవోకు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

మోస్రా,ఏప్రిల్‌6: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో జానకి పేర్కొన్నారు. మోస్రా మండల కేంద్రంలోని రామాలయం వెనుక గల అంగన్‌వాడీ కేంద్రంలో బయటి వ్యక్తులతో పని చేయిస్తున్నారు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంతో సీడీపీవో కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చే గర్భిణీలు, బాలింతలతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ భర్త బియ్యం బస్తాలు తీసుకుని వెళ్తున్నారని కాలనీవాసులు సీడీపీవోకు ఫిర్యాదు చేశారు. సమయపాలన పాటించకుండా అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో టీచర్, ఆయాలకు మెమో జారీ చేశారు. మరోసారి పొరపాట్లు జరగకుండా చూస్తామన్నారు. అనంతరం సరుకులు, వండిన అన్నం,కూరలను పరిశీలించారు.ప్రతీఒక్క సెంటర్‌లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని లేదంటే శాఖపరమైన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్,ఆయా, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలి

నవీపేట,ఏప్రిల్‌6: వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని శిక్షకులు నరేందర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఓపీవో(అదర్ పోలింగ్ ఆఫీసర్)లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో అధికారులు తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ నరేష్, ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.235	రూ. 275



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,200	రూ.66,600	రూ.835

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (10.30, 3.40, 7.05, 10.30)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (11.00, 1.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (4.20, 10.00)
: మంజుమ్మల్ బాయ్స్ (7.00)
స్క్రీన్-3 : టిల్లు స్క్వేర్ (10.35, 7.45, 10.45)
: ఫ్యామిలీ స్టార్ (1.35)
: భరతనాట్యం (5.00)
స్క్రీన్-4 : మంజుమ్మల్ బాయ్స్ (10.35, 10.20)
: టిల్లు స్క్వేర్ (1.35)
: ప్రాజెక్ట్-జెడ్ (4.35)
: క్రూ (హిందీ) (7.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (10.25, 1.30, 4.35, 7.40, 10.45)
స్క్రీన్-2 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 7.35, 10.30)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (4.50)
స్క్రీన్-3 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (1.40)
: టిల్లు స్క్వేర్ (4.40)
: మంజుమ్మల్ బాయ్స్ (7.30, 10.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : ప్రాజెక్ట్-జెడ్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మంజుమ్మల్ బాయ్స్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్